# పట్టాభిషోఖం

కథ పేరు చూసి అచ్చుతప్పు అనుకుంటున్నారా? ఈ మాత్రం తెలుగురాని వాడు కథ రాయడానికెలా సాహసించాడని హాచ్చర్యపోతున్నారా?

ఆగండాగండి. అప్పుడే మీరు తొందరపడి నన్ను కంగారు పడితే ఎలా? "నిదానమే ప్రధానం"పై నమ్మకం లేకున్నా కాస్తన్నా ఓపిక ఉండాలండోయ్. కథ చదివాక, నిజం నిలకడ మీద తెలిసిందని మీరే ఒప్పుకుంటారు.

మన కథానాయకుడు ఉండేది ముంబయిలో. ముంబయి ఎక్కడ ఉందని ముక్కున వేలేసుకోకండి. మీకు తెలిసిన బొంబాయి ఇప్పుడు ముంబయిగా మారింది. పేరెందుకు మారింది? పేరు మారగానే ఊరు మారిందా? అక్కడి జీవితం మారిందా? రద్దీ తగ్గిందా?

సబర్బన్ ట్రైన్లు టైము ప్రకారం నడుస్తున్నాయా! బస్సులు స్టేజీలపై ఆపుతున్నారా? గ్యాంగ్‌వార్ల మాటేమిటి? అన్న ప్రశ్నలు వేయకండి. రామాయణంలో పిడకల వేటవుతుంది.

ఆ, మనం ఎక్కడున్నాం? ముంబయిలో కదూ? పట్టాభి, అదే మన కథానాయకుడుగురించి మాట్లాడుకుంటున్నాం. అవునా? మనం మాట్లాడుకోవడం ఏమిటి? మేమేం అనందే! మావైపు, మీవైపు ఒక్కడివే దున్నుకుపోతున్నావ్ అంటారా? సరే, ఒప్పుకుంటాను. నేను మాట్లాడుతున్నాను, మీరు వింటున్నారు. కాదు. చదువుతున్నారు. సరేనా?

పట్టాభి అంటే అల్లాటప్పా అనుకుంటున్నారా? కాదు. కథాకాలానికి ఓ జాతీయ

బ్యాంకులో ఎక్కౌంటెంట్‌గా ఉన్నాడు. అంతకు ఆర్నెల్ల క్రితమే కాందీవలీలోని మూడు గదుల సొంతఫ్లాటులోకి మారాడు. అవడానికి సొంతఫ్లాటే ఐనా, సొంతం కాదు. కాందీవలీకి మారకముందు అతనెక్కడుండే వాడంటారా? దానికి చాలా కథుంది. ఫ్లాష్ ఇంకొంత దూరం ఫోకస్ చేయక తప్పదు. సినిమాల్లోలా ఇక్కడ కూడా ఫ్లాష్‌బ్యాక్ తప్పదా? అని గొణక్కండి. ఫ్లాష్‌బ్యాక్ లేకపోతే కథ మజాగా ఉండదు. అది మీకు తెలుసనుకోండి.

రామయ్య అంటే పట్టాభి తండ్రి మన దేశానికి స్వాతంత్ర్యం రాకముందే స్వతంత్రించాడు. ఉన్న ఊళ్ళో మగ్గం నేయడం ఇష్టంలేక, అదే బట్ట మెషీన్లమీద నేయడానికి బొంబాయి వచ్చాడు. అప్పుడింత పోటీ లేదు కాబట్టీ, ఇంతకంటే ఎక్కువ మిల్లులు పని చేస్తూ ఉండబట్టీ సులువుగానే లెర్నర్ వీవర్‌గా చేరాడు. కొద్దికాలంలోనే వీవర్‌గా పర్మనెంటయ్యాడు.

దేశానికి స్వాతంత్ర్యం రావడం, రామయ్య స్వాతంత్ర్యం హరించుకుపోవడం, అదే పెళ్ళి కావడం ఒకే సంవత్సరం జరిగాయి. తర్వాత ఇక చెప్పాలా? సంవత్సరం లోపే మన కథానాయకుడు పట్టాభి జన్మించాడు. అంటే అతను పుట్టాక "పట్టాభి" అని నామకరణం చేశారన్నమాట. పట్టాభి ఇంటిపేరనుకున్నారు కదూ. కాదు, అది అతని సొంత పేరే.

తిలక్, గాంధీ, నెహ్రూ లాంటి పేరు పొందిన వారి పేర్లుపెట్టుకోవడం మనకు అలవాటేగా! అలాగే ఇదీనూ!

పెళ్లి కాగానే పరేల్‌లో తన మిల్లు దగ్గరి "పూనావాలా చాల్"లో ఒక గది బాడుగకు తీసుకున్నాడు రామయ్య. ఎనభై నాలుగు ఒంటి గదుల ఒంటి అంతస్తు గల ఆ చాల్, చతురస్రాకారంలో ఉంది. మధ్యలో ఖాళీ స్థలం. గదికి అయిదు రూపాయలు బాడుగ. రోజుకనుకుంటున్నారా? కాదండోయ్! నెలకు. రామయ్య నెల జీతం ముప్ఫై రూపాయల వరకు వచ్చేది. భార్య శాంతమ్మ బీడీలు చేసి నెలకు పది రూపాయల దాకా సంపాదించేది. వారు రెణ్ణెల్లకు ఒక తులం (దాదాపు పన్నెండు గ్రాములు) బంగారం కూడబెట్టేవారు. తులం ఇరవైరెండు రూపాయలే ఆయె మరి!

రామయ్య, తన తోటివారిలా తాగి తందనాలాడక, పొదుపుగా, గుట్టుగా సంసారం నడిపేవాడు. పట్టాభి తర్వాత ఓ అమ్మాయి, ఓ అబ్బాయి, మూడు మూడేళ్ళ తేడాతో పుట్టారు. ఆ తర్వాత సాహసించి "ఎర్ర త్రికోణం" అమలు చేశారు రామయ్య, శాంతమ్మ. ఆ రోజుల్లో అది విడ్డూరంగా చెప్పుకున్నారు.

మునిసిపల్ స్కూల్లో నాలుగవ తరగతి పాసు కాగానే, పట్టాభిని ఆంధ్రా స్కూల్లో అయిదవ తరగతిలో చేర్చాడు రామయ్య. అది ఇంగ్లీషు మీడియం స్కూలు కాని మెట్రిక్ వరకు "తెలుగు" ఒక విషయంగా బోధిస్తారు. తన కొడుకు ఇంగ్లీషు మీడియంలో చదివినా మాతృభాష కూడా నేర్చుకోవాలని రామయ్య మనోభీష్టం. ఇంటికి దూరమైనా, ఫీజులు కట్టవలసి ఉన్నా, స్కూలు బస్సులో పంపేవాడు.

పట్టాభి ఎనిమిదిలోకి వచ్చేసరికి, అతనికి చదువుకోడానికి సరియైన స్థలం లేక

పోయింది. హాలు, వంటగది, బెడ్రూం, బాత్రూం అన్నిటికి ఒక్క గదేనాయె. బొంబాయి విడిచి తన ఊరుకు మారదలచిన "విఠోబమానే"కు పదకొండు వేలు "పగిడీ" చెల్లించి పక్క రూము తన పేర బాడుగకు తీసుకున్నాడు. రామయ్యకు కొడుకు చదువంటే అంత శ్రద్ధ.

స్కూలు ఫైనల్‌లో డిస్టింక్షను వచ్చింది. డాక్టరు, ఇంజనీరు, చదివించడం తనవల్ల కాదన్నాడు రామయ్య. పట్టాభికి రాజీ పడక తప్పలేదు. మంచి కాలేజీలో సైన్సులో సీటు వచ్చే అవకాశాలున్నా, కామర్సులో చేరాడు పట్టాభి.

ఆవలిస్తున్నారా? కథేమిటింత సీరియస్సయిందని విసుగు పుడుతుందా? తియ్యటి పాలు మరీ ఎక్కువయితే నవ్వుల పాలు అయ్యే ఛాన్సుంది. ఫర్ ఏ ఛేంజ్...

ఎక్కడిదాకా వచ్చాం? పట్టాభి కామర్సు కాలేజీ దాకా కదూ? కాలేజీలో ఓ వెలుగు వెలిగాడు మన పట్టాభి. ఆటలు, డిబేటింగ్సు, డ్రామాలు, అన్నిట్లో మేటిగాన్ననిపించుకున్నాడు. అయినా అతని కాళ్ళు నేల మీదే ఆనేవి. చదువును నిర్లక్ష్యం చేయలేదు. బి. కాం. ఫస్ట్ క్లాసులో పాసయ్యాడు. కాలేజీలో రెండవవాడుగా వచ్చాడు. చార్టెడ్ ఎక్కౌంటెన్సీ (సి.ఎ.)లో చేరి మరో మూడు, నాలుగు సంవత్సరాలు తండ్రికి భారం కావడం ఇష్టం లేదు. అందుకే అటు ఎం.కాం.లో చేరి ఇటు ఉద్యోగాల వేట ప్రారంభించాడు పట్టాభి.

"పూనావాలా చాల్లో"ని మొదటి పట్టభద్రుడు పట్టాభి. అతని తోటి వారు చాలామంది ఏడెనిమిది తర్వాత స్కూలు మానేశారు. ఇద్దరు మాత్రం మజిలీలు చేసి, స్కూలు ఫైనలు అయిందనిపించారు. ఆ తర్వాత చిన్న, చితక పనుల్లో చేరిపోయారు. అందుకే పట్టాభి అంటే అభిమానం చాలామందికి. కొందరికి అసూయ కూడా లేకపోలేదు. కానీ వారి సంఖ్య చాలా స్వల్పం.

గణపతి ఉత్సవాల సందర్భంగా పట్టాభిని సభాముఖంగా సన్మానించారు చాల్ కమిటీవారు. "సరస్వతి" వెండి ప్రతిమను జ్ఞాపికగా ఇచ్చారు. పట్టాభిని ఆదర్శంగా తీసుకుని మిగతా వారు కూడా బాగా చదవాలని సభాధ్యక్షుడు సలహా ఇచ్చాడు. సన్మానానికి తన కృతజ్ఞతలు తెలియచేస్తూ, చదువుకు సంబంధించి ఎవరికైనా, ఏ మార్గదర్శకానికైనా తను సిద్ధం అని పట్టాభి మాట ఇచ్చాడు. చాల్లోని పిల్లలకు ఉచితంగా ట్యూషన్లు చెబుతానని అన్నాడు. అతనలా అనగానే, కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి. (అలా అన్నాలి నిజంగా ముట్టాయో లేదో నాకూ తెలియదు) ఆరోజు రామయ్య కుటుంబ సభ్యుల ఆనందం వర్ణనాతీతం.

తీరిక సమయంలో ట్యూషన్లు చెప్పడం ప్రారంభించాడు పట్టాభి. స్కూల్ ఫైనల్‌తో చదువు మానేసిన వాళ్ళను సాయంత్రం, ఉదయం కాలేజీల్లో చేరడానికి ప్రేరేపించాడు. ఏడెనిమిది తరగతితో స్కూలు మానేసిన వాళ్ళకి ప్రైవేటు ఎస్.ఎస్.సి. కోచింగు మొదలుపెట్టాడు.

రేషనుకార్డు ఫారం నుండి, ఉద్యోగ దరఖాస్తులదాకా, ఏ అర్జీ అవసరమైన పట్టాభినాశ్రయించే వారు అంతా. అలా అందరి హృదయాల్లో స్థానం ఏర్పరచుకున్నాడు తన హృదయం మాత్రం పదిలంగా ఉంచుకున్నాడు, ఇంకా ఎవరికీ ఇవ్వలేదు.

చాల్లోని సన్మానంతో పట్టాభి ఆత్మవిశ్వాసం పెరిగింది. అది తలలోకి పోకుండ తలెత్తుకు తిరిగేలా మాత్రం ఉపకరించింది.

పట్టాభి బ్యాంకు ఆఫీసర్ టెస్టు రాశాడు. మూణ్ణెల్లలో ఇంటర్వ్యూకు పిలుపువచ్చింది అదీ బాగా చేసాడు. అతని ఎం.కాం మొదటి సంవత్సరం పూర్తి కాకుండానే, ఓ జాతీయ బ్యాంకులో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా చేరాడు. తన మొదటి జీతం వచ్చిన రోజున చాల్లోని వారందరికీ స్వీట్లు పంచాడు.

పట్టాభి పరపతి ఇంకా పెరిగింది. అంతవరకు అరే, ఒరే, అనేవారు కూడా ఏమోయి ఏమయ్యా (మరాఠీలోనే లెండి) అనడం మొదలు పెట్టారు. ఎవరింటికి ఏ ఫంక్షనుక వెళ్ళినా కుర్చీ వేసి కూర్చోబెట్టేవారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా పొగడసాగారు. సిగ్గునభినయించ వాడు పట్టాభి. లోలోపల సంతోషంగానే ఉండేది. పట్టాభి ఎం.కాం. అయ్యాడు. అంతక ముందే ఉద్యోగంలో కన్ఫర్మ్ అయ్యాడు. సి.ఎ.ఐ.ఐ.బి. మీద దండయాత్ర మొదలుపెట్టాడు

ఏమిటిలా పరుగెత్తుతున్నాడంటారా? ఎనిమిది పేజీల్లో కథ పూర్తిచేయాలాయె పరుగెత్తక పోతే కథెలా పూర్తి చేస్తానూ? కథేనా? మజాకా?

మగవాళ్ళకి ఇరవై ఏళ్లు నిండీ నిండకుండానే పెళ్ళి, పెళ్ళని వెంటపడేవారప్పుడు ఎం.కాం. చేసి బ్యాంకులో ఆఫీసరుగా పర్మనెంటు అయిన పట్టాభిని వదలిపెడతారా బొంబాయిలోని ప్రముఖులు, కాస్తో కూస్తో డబ్బున్న తెలుగు వారు రామయ్య ఇంటిచుట ప్రదక్షిణలు చేయడం మొదలుపెట్టారు. ఆంధ్రానుంచి కూడా ఉత్తరాలు రాసాగాయి. ఇట తల్లిదండ్రుల ఒత్తిడి, అటు బంధువుల పోరు, సాండ్‌విచ్ అయ్యాడు పట్టాభి. ఎలాగ ధైర్యం చేసుకుని మెత్తగానైనా కరాఖండిగానే చెప్పాడు. అప్పుడే తన పెళ్ళిమాట తలపెట్టవద్దని. కనీసం మూడు గదుల సొంతఫ్లాటు తీసుకున్నాకగాని పెళ్లి చేసుకోన భీష్మించాడు. సొంత ఫ్లాటంటే, అప్పట్లో కూడా లక్షల్లో వ్యవహారం.

అయిదు సంవత్సరాల సర్వీసు తర్వాత హౌసింగ్‌లోను దొరుకుతుందనీ, అంతదాక అంతో, ఇంతో కూడబెట్టి, లోను దొరకగానే ఫ్లాటు తీసుకోవాలని పట్టాభి, రామయ్యన ఒప్పించాడు. తల్లికి మాత్రం పెళ్లికి, ఫ్లాటుకు ముడిపెట్టడం నచ్చలేదు. అత్తరికం చేయాల తహ తహ లేకున్నా, క్షీణించి పోతున్న తన ఆరోగ్యం దృష్ట్యా, ఆమె కోడలు రావాల ఆరాటపడ్డం.

పట్టాభి పట్టుదలకు కారణం లేకపోలేదు. అతనితో బ్యాంకులో పనిచేసేవారందర ఉన్న(త) కుటుంబాల్లోంచి వచ్చినవారే. వారెవ్వరూ తనలా మిల్లు ఏరియాలో ఉండర వారిని తమ ఇంటికి పిలవాలంటే నామోషీ, ఎగతాళి చేస్తారని జంకు. సంసార జీవిత గురించి అతనికి కొన్ని కలలున్నాయి. చాల్లోని ఇరుకు గదుల్లో అవి ఇమడవు.

అయితే అతని పట్టు సడలించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. శాంతమ్మ ఉబ్బసం వ్యాధి తీవ్రరూపం దాల్చింది. దుర్గ పెళ్లయి కాపురానికి పోయాక ఇంట్లో ఆమెకు ఆడ దిక్కు లేకపోయింది. ఎవరండీ ఈ దుర్గ అంటున్నారా. పట్టాభి చెల్లెలండీ! పట్టాభి పెళ్లి వద్దంటే ఊర్కున్నారు కాని, రామయ్య దంపతులు దుర్గ పట్ల తమవంతు కర్తవ్యం నెరవేర్చారు. దుర్గ బి.ఏ. పాసు కాగానే హైద్రాబాద్‌లో ఎలక్ట్రానిక్ కార్పొరేషన్‌లో ఇంజినీరుగా పనిచేస్తున్న వరుణ్ణి చూసి పెళ్లి కానిచ్చారు. పట్టాభి సోదిలో పడి మనం అది గమనించలేదు.

సరే, సెంటిమెంటుతో శాంతమ్మగారు పట్టాభిని లొంగదీసారు. తల్లికిచ్చిన మాట కోసం పెళ్లి చేసుకోనిది ఆ భీష్ముడైతే, తల్లి మాట కోసం తన పట్టు సడలించి పెళ్లి కొప్పుకున్నాడు ఈ భీష్ముడు. అదే మన పట్టాభి పాతిక సంవత్సరాల వయసొచ్చిన మన యువకర(త్రా)త్నానికి కూడా పెళ్లిపై మూడు కలిగింది. సై అన్నాడు. అలా మృదుల ఆంధ్రా నుండి పూనావాలా చాల్లోకి దిగుమతి అయింది. దుర్గ హైద్రాబాదుకి ఎగుమతి అయినట్టుగా! ఏవరండీ మన తెలుగువాళ్ళలో వ్యాపార లక్షణం లేదన్నది?

పెళ్లి అయింతర్వాత తమ ఇల్లు మరీ ఇరుకుగా అనిపించసాగింది. భార్య మృదుల సరేసరి. తమ ఊర్లో, ఎన్నో గదులున్న బంగళా ఆయె.

ఇటు హౌసింగ్ లోనుకు అర్హత ఏర్పడటమే ఆలస్యం. అటు కాందీవలీలో ఫ్లాటుకు బేరం చేశాడు. పట్టాభి రెండు నెలల్లో ఫార్మాలిటీస్ అన్నీ పూర్తి చేసి ఫ్లాటు తాళాలు తీసుకున్నాడు. రామయ్య మాత్రం ఆ చాల్ విడిచి ససేమిరా రానన్నాడు. ఆ వయసులో ఇరవై కిలోమీటర్లు ట్రైన్లో ప్రయాణం చేసి మిల్లుకు రావడం పడదన్నారు. ఇంజినీరింగు చదివే దినేష్ - అదే పట్టాభి తమ్ముడి కాలేజి కూడా కాందీవలీకి దూరమే. ఆ నేపథ్యంలో పట్టాభి, మృదుల మాత్రమే కొత్త ఇంటికి మారవలసి వచ్చింది.

గృహ ప్రవేశానికి మంచి ముహూర్తం చూసి పూజ చేశారు. పట్టాభి ఫ్లాటును, ఆ పరిసరాల్ని చూసి, చాల్లోని చాలామంది ముగ్ధులయ్యారు. పెద్దహాలు, వంటగది, పడక గది, బాత్రూం, లెట్రిన్, అన్ని హంగులతో చక్కగా ఉంది. తమ చాల్లో తమ కళ్ళ ముందు పుట్టి, పెరిగిన కుర్రవాడు బ్యాంకులో ఆఫీసరు కావడం, సొంత ఫ్లాటులోకి మారడం, వారికి గర్వ కారణమైంది.

పట్టాభి కొత్త ఇంటికి బయలు దేరినాడు. చాలంతా రోడ్డు మీదికి తరలి వచ్చింది. కన్నీళ్ళతో - ఆనంద భాష్పాలండోయ్, పట్టాభి దంపతులకు వీడ్కోలిచ్చింది. శాంతమ్మ కొన్ని రోజులపాటు కొత్త ఇంట్లో ఉండటానికి ఒప్పుకుంది. కోడలుకు సంసారంలోని మెళకువలు నేర్పాలిగా మరి!

శాంతమ్మ పరేల్ తిరిగి వెళ్ళి పోయిం తర్వాత, రాజా-రాణీలదే రాజ్యం! కావలసినంత ఏకాంతం. ఫ్లాటు తలుపులు మూసి, ఆడింది ఆటగా, పాడింది పాటగా, దినాలు, క్షణాలుగా గడపసాగారు. తమ కొత్త ఇంటిని తీర్చిదిద్దారు.

ఆఫీసు, ఇల్లు మధ్య రెండు గంటల దూరం పెరిగినా, కుక్కిన పేనులా

ఉండిపోయాడు పట్టాభి. సొంత ఫ్లాటు కావాలాయె! పట్టాభి ఆఫీసుకు పోయింతర్వాత ఇంట్లో బోరు కొట్ట సాగింది మృదులకు. పత్రికలతో ఎంతసేపని కాలక్షేపం చేస్తుంది? పరేల్‌లో అయితే సమయం ఎలా గడిచేదో తెలిసేది కాదు. పక్కింటి వారితో స్నేహం కలపడానికి ప్రయత్నం చేసింది. కుదరలేదు. ఒకళ్ళు పంజాబీలు. ఆయనకు ఓ పెద్ద సంస్థలో పేద్ద ఉద్యోగం. కంపెనీ కారుంది. ఇక మనవాళ్లు కళ్ళకి ఆనుతారా? ఇంకో ఆవిడ గుజరాతీ. వాళ్ళకు సొంత ఫ్యాక్టరీ ఉంది. వారి ఫ్లాటు కూడా పెద్దదే- అయిదు గదులది. రెండు కార్లున్నాయి. ఆవిడ కాస్త కలుపుగోలు మనిషే. వీలుని బట్టి మసలుకోవాలి. ఆమె సొంతడబ్బా వినాలి. మృదులకు పదే పదే పూనా డాలాచాల్ జ్ఞాపకం రాసాగింది. తమ ఊరుపైకి మనసు పోసాగింది. ఇటు పట్టాభి పరిస్థితి కూడా ఇంచుమించు అలాగే ఉంది. ఇక్కడి వారందరూ హోదాలో అతని కంటే పై మెట్టునున్న వారే. అతనికిక్కడ గుర్తింపే లేదు. గృహ ప్రవేశానికి వచ్చిన జనాన్ని చూసి, పట్టాభి పట్ల తేలికభావం ఏర్పరచుకున్నారు వారు. ఆ సరికి కనిపించినప్పుడల్లా విష్ చేసేవాడు పరిచయం ఉన్న మొఖాలను. కాని సరైన స్పందన లభించలేదు.

పూనావాలా చాల్లో తనకు జరిగిన సన్మానం, లభించిన గౌరవం, పొందిన ప్రేమ మరీ మరీ జ్ఞాపకం రాసాగాయి. మృదులకు వేవిళ్ళు మొదలై ఒకనాడు తీవ్రంగా జబ్బు పడింది. పక్కనున్న గుజరాతీ ఆమె వచ్చి ఏదో మాత్ర, మొక్కుబడిగా ఇచ్చి ఇంత టీ ఇచ్చింది. తాను ఆఫీసు నుంచి వచ్చేసరికి తలుపు గడియ కూడా తీయడానికి శక్తి లేకపోయింది. చాల్లో తన తల్లి జబ్బు పడటం గుర్తుకొచ్చింది. శాంతమ్మకు ఉబ్బసం ఎక్కువైంది. సమయానికి ఇంట్లో ఎవరూ లేరు. చాల్లోని వారే డాక్టరు సలహాపై ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలిసి తను, నాన్న ఆస్పత్రికి పోయేసరికి, పండ్లు, కొబ్బరినీళ్ళు, ఇత్యాదులు తీసుకుని కనీసం ఇరవై మందన్నా హాస్పిటల్లో హాజరుగా ఉన్నారు. తిరిగి పరేల్‌కు మారుదామా అని తీవ్రంగా ఆలోచించసాగాడు పట్టాభి.

హమ్మయ్య! దగ్గరకొచ్చేశాం. ఇంకెంత? ఒక్క పేరా మాత్రమే.

తనహోదా, సాటివారిలో తన పరువూ, బొత్తిగా ప్రైవసీ లేకపోవడం, లెట్రిన్ కొరకు క్యూ, మనసులోకి వచ్చి, అతని ఆలోచనలను అడ్డుకున్నాయి.

చదువులో, పనిలో, చురుగ్గా సాగే పట్టాభి బుర్ర, ఇలాంటి పరిస్థితి ఎదురయ్యే సరికి, బెంబేలెత్తిపోయింది. ఆత్మన్యూనతాభావం పట్టాభిలో గూడు చేసుకుంది. మనసు గుర్తింపు కొరకు తహ తహలాడ జొచ్చింది. అదే అతని శోకానికి కారణం. మీరే చెప్పండి. ఇది శోకించతగ్గ కారణం అంటారా? అందరి జీవితం వడ్డించిన విస్తరి కాదు కదా? అయినా ఇప్పుడు పట్టాభి జీవితానికి వచ్చిన లోటేమిటి? పరిస్థితులను అనుకూలంగా మార్చుకోవడమే జీవించడం గదా? అందుకే "పట్టాభిశోఖం" అన్నాను. మీరు ఒప్పుకుంటారా? కుంటే కథకు పట్టాభిషేకం చేయండి! కోరూ? కోకండి. నాదేం పోయింది. కానీ పట్టాభికి స్థైర్యం రావడానికి ధైర్యం నూరిపోయండి. మీ మేలు మరిచిపోడు. ★